www.vishalabharati.com
epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
19.02.2024
సంపుటి:2 సంచిక:127

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



## మహిళలకు శుభవార్త

- డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు
- గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యచరణ
- ఆశా వర్కర్లకు ప్రతినెల 1న జీతాలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

..మిగతా 2 లో

“ బీజేపీ కార్యకర్తలు 24 గంటలూ దేశానికి సేవ చేయడంలో నిమగ్నం కావాలనిa జాతీయ మండలి ముగింపు సమావేశానికి ఆయన హాజరై కార్యకర్తలను ఉత్తేజపరిచారు. రాబోయే 100 రోజులు ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమయంలో ప్రతి ఓటరుకు చేరువ కావాలన్నారు.

# ప్రతి ఓటరుకూ చేరువ కావాలి



ప్రజల సంక్షేమం, దేశం కోసం పాటు పడుతున్న బీజేపీ కార్యకర్తలకు ఎక్కడా గర్వం లేదని ప్రధాని మోడీ అన్నారు. గతం కంటే బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పదేండ్లలో ఎంతో అభివృద్ధి సాధించామని, అద్భుతమైన విజయాలు అందుకున్నామన్నారు. ‘వికసిత్ భారత్’ కోసం ప్రజలంతా కృషి చేస్తున్నారన్నారు. ప్రజల స్వప్నాలు తప్పకుండా సాకారమవుతాయి. రానున్న ఐదేండ్లు మనకు చాలా కీలకమని, అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడానికి కష్టపడుదామని మోడీ అన్నార. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారాలంటే.. దేశంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రావాలన్నారు.

- 100 రోజులు ఉత్సాహంగా పనిచేయాలి
- బీజేపీ శ్రేణులు దేశ సేవలో ముందుండాలి
- మళ్లీ గెలుపు మనదే.. వికసిత భారత్ మన లక్ష్యం
- 18వ లోక్‌సభను ఎన్నుకునేది.. 18 ఏండ్ల యువతనే..
- మహిళా సాధికారతే మన ప్రధాన లక్ష్యం
- ఎన్డీఏ కూటమికి..400, బీజేపీకి 370 పైనే సీట్లు..
- లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ దిశానిర్దేశం
- కార్యకర్తలకు విజయ మంత్రం బోధించిన ప్రధాని

**విశాల భారతి, నేషనల్‌బ్యూరో:**

బీజేపీ జాతీయ సదస్సులో కార్యకర్తలు, పార్టీ నేతలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పార్టీ ప్రతిష్టతో పాటు దేశాభివృద్ధిలో పాలు పంచుకుంటున్న కార్యకర్తలందరికి అభినందనలు తెలిపారు. బీజేపీ కార్యకర్తలు ఏడాదిలో రోజూ దేశానికి సేవ చేసేందుకు ఏదో ఒకటి చేస్తూనే ఉన్నారన్నారు. బీజేపీ కార్యకర్తలు 24గంటలు దేశం కోసం కష్టపడుతున్నారన్నారు. కానీ ఇప్పుడు అసలు సమయం వచ్చింది. 100 రోజులు కొత్త శక్తితో, కొత్త ఉత్సాహంతో, కొత్త విశ్వాసంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రతిపక్ష నేతలు కూడా ఎన్డీయే 400 దాటిందంటూ నినాదాలు చేస్తున్నారు. ఈ దేశాన్ని భారీ కుంభకోణాలు, ఉగ్రవాదం నుంచి బీజేపీ విముక్తి చేసింది. మనం శివాజీని నమ్మేవాళ్లం. దేశానికి సేవ చేసేందుకు బీజేపీకి అత్యధిక సీట్లు వస్తాయని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు స్పెషల్ టాస్క్ ఇచ్చారు ప్రధాని మోదీ. బీజేపీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తూ, ఫిబ్రవరి 18 అని,

..మిగతా 2 లో

తెలంగాణ అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని, విజన్ - 2050 లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచంతో హైదరాబాద్ పోటీ పడుతుందన్నారు. పెట్టుబడులకు అనువైన ప్రాంతమని, గత 30ఏళ్లుగా హైదరాబాద్ నగర అభివృద్ధి కొనసాగుతోనే ఉందని రేవంత్ రెడ్డి వివరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడలో అగ్నిమాపక శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. విపత్కర పరిస్థితుల్లోనూ ఫైర్ శాఖ సేవలు అమూల్యమైనవని ప్రశంసించారు. ప్రాణాలకు తెగించి అగ్ని ప్రమాదాలు జరిగినపుడు ప్రజల ప్రాణాలను కాపాడే ఫైర్ సిబ్బంది సేవ ఎప్పటికీ మరువలేనివన్నారు. క్రెడాయ్ తెలంగాణ ఆర్థిక సహకారంతో నిర్మించిన ఫైర్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అవిష్కరించారు.





# తెలంగాణ అభివృద్ధికి విజన్-2050

- రాష్ట్రమంతా వర్తించేలా మెగా మాస్టర్ ప్లాన్
- వేగంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అడుగులు
- త్వరలోనే రీజినల్ రింగ్ రోడ్డు పనులు షురూ
- 10,15 ప్రాంతాల్లో ఫార్మా విలేజీల ఏర్పాటు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- నానక్ రాంగూడలో ఫైర్ సీసీఎస్ ఆవిష్కరణ

**విశాల భారతి, హైదరాబాద్:**

**శాంతి భద్రతలతోనే అభివృద్ధి..**

మెరుగైన శాంతి భద్రతలతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని, గత ముప్పై ఏండ్లుగా హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు, వైఎస్ఆర్, కేసీఆర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా వారు తీసుకున్న నిర్ణయాలు, అనుభవాలతో తమ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందన్నారు. కఠిన శిక్షలతోనే ప్రమాదాలను కట్టడి చేయవచ్చని, చట్టానికి పదును పెట్టేందుకు అగ్నిమాపకశాఖ కసరత్తు చేయాలన్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రీజినల్ రింగ్ రోడ్డును త్వరలోనే తీసుకువస్తామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రింగ్ రోడ్డు చుట్టూ మెట్రో రైల్ సదుపాయం, తెలంగాణ అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. విజన్ 2050 లక్ష్యంతో ముందుకు వెల్తున్నామని తెలిపారు. అర్బన్, రూరల్ తెలంగాణను అభివృద్ధి చేస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు అనువైన ప్రాంతమని, మహానగరాన్ని అర్బన్, సెమీ అర్బన్,

..మిగతా 2 లో



## గురుకులాల్లో ఏం జరుగుతోంది..?

- స్టూడెంట్లు ఎందుకు సూసైడ్ చేసుకుంటున్రు
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లేకనే సమస్యలు
- గురుకులాల్లో విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇప్పించాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

విశాల భారతి, స్టేట్ బ్యూరో:

సూర్యాపేట మండలం ఇమాంపేట ఎస్సీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినుల ఆత్మహత్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పందించారు. విద్యార్థినుల వరుస ఆత్మహత్యలు బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రోజుల వ్యవధిలోని ఆత్మహత్య చేసుకున్నారని, తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో ఏం జరుగుతోంది..? అని ప్రశ్నించారు. విద్యార్థులు ఎందుకు ఇలా వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పూర్తిస్థాయి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లేకపోవడంతోనే ఇలాంటి అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, విద్యార్థినుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే పూర్తిస్థాయి సంక్షేమ శాఖ మంత్రిని నియమించడంతో పాటు విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. వారం రోజుల క్రితమే ఓ విద్యార్థిని హాస్టల్‌లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా.. ఇవాళ అదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థిని ఉరి వేసుకుని సూసైడ్ చేసుకుంది. 10 రోజుల వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యలకు పాల్పడటం రాష్ట్రంలో సంచలనంగా మారింది.

# గిరిజన యువత ఉపాధికి కృషి

- ఐటీడీఏ ద్వారా వృత్తి కోర్సుల్లో శిక్షణ
- గిరిజన ప్రాంతాల అభివృద్ధికి స్పెషల్‌ప్లాన్స్
- గిరిజన రైతులకు సబ్సిడీపై కరెంటు బోర్లు
- ఐటీడీఏ మీటింగ్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులకు జీవనోపాధి పెంపొందించుకొని జీవించడానికి ఐటీడీఏ ద్వారా వృత్తి శిక్షణ ఇప్పించడంతోపాటు మ్యాక్స్ సంస్థ ద్వారా వారికి అన్ని రకాల వసతులు కల్పించడానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి, ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం ఐటీడీఏ సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పైచదువులు చదవలేక డిగ్రీ, ఇంటర్, టెన్త్‌వరకు చదువుకున్న గిరిజన యువత శిక్షణ తీసుకొని వారి కుటుంబాలను పోషించుకోవడానికి జిల్లా సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, ఐటీడీఏ వైటీసీ ద్వారా వివిధ రకాల శిక్షణలో ఇవ్వడం చాలా సంతోషకరమన్నారు. న్యాక్ సంస్థ ద్వారా నిష్ణాతులైన ఫ్యాకల్టీలచే ప్రత్యేక శిక్షణలు ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. భద్రాచలం మధిర కొత్తగూడెం ఖమ్మం ఇల్లందు మండలాలలో యువతకు శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందించాలని ఆయన అన్నారు. అలాగే 1975లో గిరిజనుల అభివృద్ధి కోసం ఐటీడీఏలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా కౌలు భూముల పట్టాలు అందజేసి రైతు భరోసా ఇస్తామన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పించి గిరిజనుల అభివృద్ధికి పాటుపడాలని అలాగే జిల్లా అభివృద్ధి కోసం త్వరలో ఫండ్స్ శాంక్షన్ చేస్తామని

..మిగతా 2 లో

# ఐటీ హబ్‌గా వరంగల్

- హైదరాబాద్‌కు ధీటుగా అభివృద్ధి
- వరంగల్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఎమ్ఎస్ఎమ్ఈల కోసం కొత్త పారిశ్రామిక విధానం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

వరంగల్ జిల్లా ప్రజలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుభవార్త చెప్పారు. వరంగల్ జిల్లాను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. వరంగల్‌ను హైదరాబాద్‌కు ధీటుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అంతటి ప్రాధాన్యత కలిగిన ద్వితీయ శ్రేణి నగరంగా పేరొందిన వరంగల్ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. అదే విధంగా ఎమ్ఎస్ఎమ్ఈల కోసం నూతన పారిశ్రామిక విధానం తీసుకొస్తామని మంత్రి స్పష్టం చేశారు. యువత ఉపాధి కోసం వచ్చే ఏడాది నుంచి నైపుణ్య వర్సిటీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



# 6 గ్యారంటీల అమల్లో ప్రభుత్వం విఫలం

- 72 రోజుల్లో ఉచిత బస్సు తప్ప.. ప్రజలకు ఒరిగిందేం లేదు..
- కాంగ్రెస్ హామీలకు బడ్జెట్లో సరిపడా కేటాయింపుల్లేవ్
- కాంగ్రెస్‌ను గిల్లితే తెలంగాణలో బీజేపీ నేతలకు నొప్పి
- మేడిగడ్డను చూపి బీఆర్ఎస్ పాలనను బద్నాం చేస్తున్రు
- కాళేశ్వరంపై బీఆర్ఎస్‌ఏ విచారణకైనా సిద్ధం
- మాజీమంత్రి, బీఆర్ఎస్‌నేత నిరంజన్ రెడ్డి సవాల్



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

6 గ్యారెంటీల అమల్లో కాంగ్రెస్ విఫలం అయిందని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఉచిత బస్సు తప్ప 72 రోజుల్లో కొత్తగా రాష్ట్రంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసింది ? అన్నదే.. కానీ అంతకన్నా తాము ఏం మెరుగ్గా చేస్తామన్నది కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పకపోవడం విచారకరమని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు సంబంధించి బడ్జెట్ లో సరిపడా కేటాయింపులు జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీల అమలు సాధ్యం కాదని బడ్జెట్ ద్వారా తేల్చిచెప్పిందని పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత రాష్ట్రంలో తిరిగి కరెంటు కోతలు మొదలయ్యాయని చెప్పారు.

హరీశ్ రావు దెబ్బకు తోకముడిచిన ప్రభుత్వం కాంగ్రెస్‌ను గిల్లితే తెలంగాణలో బీజేపీ నేతలకు ఎందుకు నొప్పి పుడుతోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, మాజీ సీఎం కేసీఆర్ మీద బీజేపీ బురదజల్లిందని, కాంగ్రెస్‌ను హామీల విషయంలో ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన నిలదీశారు. మేడిగడ్డలో మూడు పిల్లర్ల కుంగుబాటును భూతద్దంలో చూపి గత ప్రభుత్వ తొమ్మిదిన్నరేళ్ల పాలనను బద్నాం చేసే ప్రయత్నం జరుగుతున్నదని అన్నారు. మాజీమంత్రి హరీష్‌రావు ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ మంత్రులు సమాధానాలు చెప్పలేక పోయారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో సంప్రదాయాలకు భిన్నంగా ఇరిగేషన్ చర్చకు ఇతర శాఖల మంత్రులు స్పందించడం విడ్డూరంగా ఉందన్నారు.

**రైతుభరోసా అమలు చేస్తారా ? చేయరా ?**

మూడెకరాలకు మించి రైతుబంధు ఇంత వరకూ ఇవ్వలేదని అన్నారు. రైతుభరోసా అమలు చేస్తారా ? చేయరా ? అని ప్రశ్నించారు. కాళేశ్వరాన్ని అడ్డుపెట్టుకుని తప్పించుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ ఉన్నదని పేర్కొన్నారు. దమ్ముంటే కాళేశ్వరంపై అత్యున్నత స్థాయిలో విచారణ

..మిగతా 2 లో

## మెడికల్ కాలేజీలుగా 6 జిల్లా ఆసుపత్రులు

- తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉత్తర్వులు

**హైదరాబాద్, విశాల భారతి:**

ఆరు జిల్లా ఆసుపత్రులు మెడికల్ కాలేజీలుగా మారనున్నాయి. ఈ మేరకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉత్తర్వులు రిలీజ్ చేసింది. గద్వాల, నారాయణపేట్, ములుగు, వరంగల్ జిల్లా నర్సంపేట్, మెదక్, యాదాద్రి జిల్లా భువనగిరిలోని జిల్లా ఆసుపత్రులు మెడికల్ కాలేజీలకు అనుబంధంగా మారుతాయి. దీంతో అవి డైరెక్టర్ ఆఫ్

..మిగతా 2 లో




# తెలంగాణ అభివృద్ధికి విజన్-2050

మొదటిపేజీ తరువాయి

రూరల్ మూడు భాగాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఒకేచోట 25 ఎకరాల్లో ఫార్మాసిటీ ఉంటే నగరం కలుషితం అవుతుందని తెలిపారు. అవగాహన లేకుండా నిర్ణయాలు తీసుకుంటే, మేడిగడ్డవలే అవుతుందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ విమానాశ్రయం పక్కన ఫార్మా పరిశ్రమల ఏర్పాటు సరికాదని చెప్పారు. ఫార్మాసిటీ కట్టలేదని కొంత మంది ఆరోపణలు చేస్తున్నారని, ఒకే చోట కాకుండా 1015 ప్రాంతాల్లో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఇన్నర్ రింగ్ రోడ్ సమీపంలో 25 వేల ఎకరాల్లో హెల్త్, స్పోర్ట్స్, కాలుష్య రహిత పరిశ్రమలతో ఒక సిటీని ఏర్పాటు చేయబోతున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉందని స్పష్టం చేశారు. ఆలోచించి నిర్ణయం తీసుకోవడం తమ విధానమన్నారు.

# మహిళలకు శుభవార్త

- డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు
- గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యచరణ
- ఆశా వర్కర్లకు ప్రతినెల 1న జీతాలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

విశాల భారతి, హైదరాబాద్:

మహిళలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డ్వాక్రా మహిళలకు త్వరలో వడ్డీలేని రుణాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. చాలా కాలం నుంచి జీతాలు రావడం లేదని ఆశా వర్కర్లు విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. వారికి జీతాలు అందేలా చూస్తానని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళా సంఘాలను నిర్వీర్యం చేసిందన్నారు. వడ్డీలేని రుణాలు అందజేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని విమర్శించారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు, స్వయం సహాయక బృందాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, రెండో ఏఎన్ఎంల వంటి వారికి ప్రతి నెల 1వ తేదీన బిల్లులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు భట్టి తెలిపారు.

# గిరిజన యువత ఉపాధికి కృషి

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. ఆ నిధులతో గిరిజన గ్రామాల అభివృద్ధి తోపాటు నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. ఆ దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు, ఆఫీసర్లు సమన్వయంతో గిరిజనుల కోసం గిరిజన గ్రామాలలో పోడు భూముల సమస్య గిరిజన రైతులకు సబ్సిడీపై కరెంటు బోర్లు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

# 6 గ్యారంటీల అమల్లో ప్రభుత్వం విఫలం

మొదటిపేజీ తరువాయి

జరిపించాలని, ఏ విచారణకైనా బీఆర్ఎస్ సిద్ధమని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ మీద రాజకీయ కక్ష్యతో రైతులను అన్యాయం చేయొద్దని హితవు పలికారు. కాళేశ్వరం కింద ఉన్న రిజర్వాయర్లు, టన్నెళ్లను వాడుకునేందుకు అవకాశం ఉన్నదని ప్రభుత్వానికి గుర్తుచేశారు. చేతనైతే కొత్త మెడికల్ కళాశాల కొడంగల్‌లో పెట్టాలని, ఆలేరు మెడికల్ కళాశాలను కొడంగల్‌కు తరలించడం పద్ధతికాదన్నారు. రైతుబంధు, రైతు భీమా, నీళ్లు, కరెంటు, వరి ధాన్యం, పంటల కొనుగోళ్లు, వరి ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్‌పై ఖచ్చితంగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్నారు.

# మెడికల్ కాలేజీలుగా 6 జిల్లా ఆసుపత్రులు

మొదటిపేజీ తరువాయి

మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో పనిచేయనున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరు ప్రాంతాలతో పాటు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోనూ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసేందుకు దరఖాస్తు చేసింది. అయితే.. కుత్బుల్లాపూర్, మహేశ్వరంలో మెడికల్ కాలేజీకి అవసరమైన సౌకర్యాలు, అనుసంధానంగా ఆసుపత్రులు లేవని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీంతో ఆరు చోట్ల మాత్రమే మెడికల్ కాలేజీలు అందుబాటులోకి రానున్నాయి.

# ప్రతి ఓటరకూ చేరువ కావాలి

మొదటిపేజీ తరువాయి

18 ఏళ్లు నిండిన యువత 18వ లోక్‌సభను ఎన్నుకోబోతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఏకాగ్రతతో ప్రతి ఓటరుకు, అన్ని వర్గాల వారికి చేరువ కావాలన్నారు. కార్యకర్తల కష్టానికి తప్పకుండా ఫలితం దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ఆచార్య విద్యాసాగర్ జీ మహరాజ్‌ని ప్రధానమంత్రి తన ప్రసంగంలో స్మరించుకున్నారు. సమాజానికి ఆయన చేసిన అమూల్యమైన కృషికి, ముఖ్యంగా ప్రజలలో ఆధ్యాత్మిక జాగృతికి ఆయన చేసిన కృషి మర్చిపోలేమన్నారు. పేదరిక నిర్మూలన, వైద్యం, విద్య, మరిన్నింటి సౌకర్యాల కోసం ఆయన చేసిన కృషికి రాబోయే తరాలు గుర్తుండిపోతాయన్నారు. ఆయన ఆశీస్సులు దేశ ప్రజలందరికీ దక్కాలని మోడీ ఆకాంక్షించారు.



వచ్చే లోక్ సభ ఎన్నికల్లో అద్భుత విజయం అందుకోబోతున్నామని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమికి 400కు పైగా సీట్లు వస్తాయని, ఇక బీజేపీ ఒక్కటే 370 సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు. ఉగ్రవాదం, అవినీతి నుంచి దేశానికి ముక్తి కల్పించామన్న మోడీ, పేదలు, మధ్య తరగతి ప్రజల జీవితాలు బాగుచేశామన్నారు. నన్ను విశ్రాంతి తీసుకోమని కొంత మంది సూచిస్తున్నారు. నాకు రాజకీయాలు ముఖ్యం కాదు.. దేశమే ముఖ్యం. శివాజీ నాకు స్ఫూర్తి.. అందుకే 24గంటలు దేశం గురించే ఆలోచిస్తా. నాకు వ్యక్తిగత ప్రతిష్ట, అధికారం ముఖ్యం కాదు. కుటుంబం కూడా ముఖ్యం కాదు. దేశ ప్రజలే నా కుటుంబమని ప్రధాని మోడీ చెప్పారు.
ఇంకా చాలా కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందన్న ప్రధాని, బీజేపీకి మహిళలు, పేదలు, యువత మద్దతు ఇస్తున్నారన్నారు. సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తున్నామని, ఆదివాసీలు, విశ్వకర్మల కోసం ప్రత్యేక పథకాలు తెచ్చామన్నారు. భేటీ పడావ్, భేటీ బచావ్ నినాదానికి ప్రజలు మద్దతు ఇచ్చారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడితే ఉరిశిక్ష వేస్తున్నామని హెచ్చరించారు. మహిళా సాధికారతే మా ప్రధాన లక్ష్యమని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

# సదస్సు పోస్టర్స్ విడుదల చేసిన ఆజాద్



సికింద్రాబాద్, విశాల భారతి:

ఎన్ ఈ పి 2020 ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25 & 26 వ తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించబోయే అఖిల భారత విద్యార్థి సదస్సును జయప్రదం చేయాలని విద్యార్థి నేతలు కోరారు. aisc tg org commitee తెలంగాణలో అన్ని జిల్లాల్లో కాంపెయిన్ కోసం ఓయూ ఎన్ ఆర్ ఎస్ హాస్టల్ నుండి బయలు దేరారు. ఈ కార్యక్రమాన్ని భారత్ బచావో నేషనల్ వైస్ చైర్మన్ డా. గోపీనాథ్, నేషనల్ కమిటీ సభ్యులు సోమయ్య, జంజెర్ల రమేష్, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓయూ రీసెర్చ్ స్కాలర్స్ ఆజాద్, యాదగిరి,లక్ష్మణ్, తల్లా అజయ్, రాష్ట్ర నాయకులు సుమంత్, ఓయూ వైస్ ప్రెసిడెంట్ ఉదయ్,విద్యార్థి నాయకులు శ్రవణ్ ,గణేష్, సనత్, నాగరాజు, విక్రమ్ పాల్గొన్నారు.

# ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



చిట్యాల, విశాలభారతి:

వెలిమినేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 93 ఎస్ఎస్ సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయులు కుమారస్వామి, అమరేందర్ రెడ్డి, బ్రహ్మచారిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ విద్యార్థి దశలో గడిపిన క్షణాలను తీపి జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ సర్వీస్ కాలంలో విద్యార్థులకు ఇచ్చిన సూచనలు సలహాలు పొంది జీవితంలో ఉన్నత స్థితి లోకి వచ్చిన సందర్భంగా తమ జీవితం ధన్యం అయినట్లుగా సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల చనిపోయిన మిత్రుడు మేడి యాదయ్య కుటుంబానికి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయ చెక్కును వారి కుటుంబానికి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి శ్రీనివాస్, గోలి మల్లేష్, అంతటి శ్రీను, రాంబాబు, సాయి కుమార్, భాస్కర్, వెంకటేష్, ఎల్లయ్య, శేఖర్, కృష్ణారెడ్డి, రాజు, గోపాల్, సునీత, పద్మ, నిర్మల, సులోచన, కస్తూరి, జంగమ్మ, జ్యోతి, విజయ తదితరులు పాల్గొన్నారు.




# ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

గరిడేపల్లి, విశాలభారతి:

గరిడేపల్లి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సైదులు ని ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పరెడ్డిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కొంతమంది మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ త్రిపురం అంజన్ రెడ్డి, కందుల వెంకట్ రెడ్డి, కందుల కోటిరెడ్డి, అంబటి శేఖర్ రెడ్డి, గరిడేపల్లి కొంతమంది నాయకులు పాల్గొన్నారు.

# రామయ్య ఫౌండేషన్ చేయూత



పాలకుర్తి, విశాలభారతి:

అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఓ వ్యక్తి కుటుంబానికి ఐఐటీ రామయ్య ఫౌండేషన్ ఆసరాగా నిలిచింది. మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన దయ్యాల యాకమ్మకు వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చెలుకపల్లి కుమారస్వామితో రెండు దశాబ్దాల కిందట వివాహం జరిగింది. కాగా అనారోగ్య కారణాలతో ఇటీవల కుమారస్వామి తన స్వగ్రామంలో మృతి చెందాడు. అయితే అతని స్వగ్రామంలో అంత్యక్రియలు కూడా నిర్వహించలేని దయనీయ స్థితిలో ఉంటే అత్తగారి గ్రామమైన మల్లంపల్లికి తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి పూట గడవడమే కష్టంగా మారిన ఆ కుటుంబ పరిస్థితి గమనించిన చుక్కా రామయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు మాచర్ల పుల్లయ్య స్పందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. బాధిత కుటుంబానికి 25 కేజీల సన్న బియ్యాన్ని జర్నలిస్ట్ కోతి సుధాకర్ ద్వారా అందజేశారు.

# ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సామెల్



నూతనకల్, విశాలభారతి:

మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో బొడ్రాయి ముత్యాలమ్మ దేవతల ప్రతిష్టాపన మూడవ వార్షికోత్సవ కార్యక్రమంలో తుంగతుర్తి శాసనసభ సభ్యులు మందుల సామెల్ పాల్గొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా మహిళలతో కలిసి బోనాలను ప్రదర్శనగా తీసుకొని వెళ్లి ముత్యాలమ్మ దేవతకు సమర్పించి బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు .అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొంపెల్లి మల్లారెడ్డి ఫార్మ్ హౌస్ లో నూతనంగా ఏర్పాటు చేసిన గొర్రె పిల్లల పెంపకం షేడ్ ను ప్రారంభించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా పరిపాలనలో ఇందిరమ్మ కలలు కన్నా పరిపాలన కొనసాగుతుందని సీఎం రేవంత్ ప్రవేశపెట్టిన అన్ని పథకాలు లబ్ధిదారులకు చేకూరేలాగా ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తీగల గిరిధర్ రెడ్డి కొంపెల్లి మల్లారెడ్డి, పగిళ్ల అశోక్ రెడ్డి ,కళ్ళం కృష్ణారెడ్డి, మండల సీనియర్ నాయకులు బాణాల సుదర్శన్ రెడ్డి ,పన్నాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ ను కలిసిన మోహన్ రెడ్డి



**బాల్కొండ, విశాల భారతి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు కలిసిన వారిలో ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ కూడా ఉన్నారు.**

# సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్తలు పడుతున్నారు..!!





అబ్దుల్లాపూర్మెట్, విశాల భారతి:

పసుమాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు అవస్తలు పడుతున్నారు. పలిగి పోయిన ఫ్లోరింగ్ తరగతి గదులు.. శుభ్రత లేని పాఠశాల ఇలా చెప్పకుంటూ పోతే ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయని పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే ఉన్నత పాఠశాల అని సౌకర్యాలు మాత్రం లేవు అని అన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యలను గుర్తించి జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాధికారి సౌకర్యాలు కల్పించగలరని విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, యువతీ యువకులు పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.



## జోధ్‌పుర్ ప్యాలెస్‌లో ఘనంగా
# షర్మిల కొడుకు పెళ్లి

- మేనల్లుడి పెళ్లికి వెళ్లని జగన్
- ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన షర్మిల
- రాజకీయ విభేదాలతో పెళ్లికి దూరం



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కుమారుడు రాజారెడ్డిప్రియా అట్లూరి వివాహం రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ ఘనంగా జరిగింది. కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో జోధ్‌పూర్‌లోని ఉమైద్ భవన్‌లో ఈ వివాహం జరిగింది. 16వ తేదీన సంగీత్, మెహందీ వేడుక నిర్వహించగా.. 17న సాయంత్రం 5.30 గంటలకు వివాహం జరిగింది. 18వతేదీ ఉదయం 11గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి. పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలను వైఎస్ షర్మిల సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కొత్త దంపతులు షర్మిలను హత్తుకున్న ఫొటో ఆకట్టుకుంటోంది. అయితే షర్మిల కుమారుడి వివాహ వేడుకకు ఆమె సోదరుడు, ఏపీ సీఎం వైఎస్ జగన్ దూరంగా ఉన్నారు. జనవరి 17న హైదరాబాద్‌లో జరిగిన తన మేనల్లుడి నిశ్చితార్థ వేడుకకు సతీసమేతంగా జగన్ హాజరై కాబోయే దంపతులను ఆశీర్వదించారు. అయితే ఆ కార్యక్రమంలో కుటుంబ సభ్యులందరితో కలిసి ఫొటో దిగాలని జగన్ భావించారు. షర్మిల మాత్రం జగన్‌తో ఫొటో దిగేందుకు ఆసక్తి చూపలేదు. జగన్ పదే పదే కోరడం, విజయమ్మ కూడా రమ్మని చెప్పడంతో.. అతి కష్టం మీద షర్మిల ఫొటో దిగినట్లు ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జనవరి 21 ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన షర్మిల.. తన సోదరుడు జగన్‌ను టార్గెట్ చేసుకొని విమర్శలు గుప్పించడం మొదలుపెట్టారు. మొదట్లో ఆమె 'జగన్ రెడ్డి' అంటూ వైఎస్సార్సీపీ అధినేతను సంబోధించారు. అలా మాట్లాడటాన్ని వైఎస్సార్సీపీ నేతలు తప్పుబట్టారు. దీంతో అయితే ఇక నుంచి జగనన్న అనే అంటానని షర్మిల చెప్పారు. సంబోధించే తీరు మారినప్పటికీ.. షర్మిల విమర్శల్లో పదును పెరిగే తప్పితే తగ్గలేదు. దీంతో జగన్ కూడా ఓ సభలో పరోక్షంగా షర్మిలను విమర్శించారు.

## జైలుకు వెళ్లాడు కాబట్టి..
# ఈసారి చంద్రబాబే సీఎం!

**రాష్ట్ర పరిస్థితులపై స్పందించిన ఉండవల్లి అరుణ్ కుమార్**


- చంద్రబాబు, సీఎం జగన్ పై వ్యాఖ్యలు
- ప్రత్యేకహోదాపై అడగడానికి భయపడుతున్నారు



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఏపీ రాజకీయాలపై తనదైన శైలిలో స్పందించారు. ఏపీకి ప్రత్యేకహోదాపై కేంద్రాన్ని ప్రశ్నించడానికి గతంలో చంద్రబాబు భయపడ్డాడని, ఇప్పుడు జగన్ కూడా భయపడ్డాడని వెల్లడించారు. కేసుల భయంతోనే వాళ్లు వెనుకంజ వేశారని తెలిపారు. రాక్షసుడ్ని, దుర్మార్గుడ్ని అయినా భరించవచ్చు కానీ, పిరికివాడ్ని భరించే పరిస్థితి ఉండకూడదని అన్నారు. "ఎన్నికల సమయంలో నోటాకు ఓట్లు పడకపోవడానికి కారణాలు ఉన్నాయి. ప్రజలు ఎవరు తక్కువ అవినీతిపరుడో చూసుకుని వారికి ఓటేస్తున్నారు తప్ప, నోటా జోలికి వెళ్లడంలేదు. మార్కెట్లో టమాటాలన్నీ పుచ్చులే ఉన్నప్పుడు వాటిలో కాస్త తక్కువ పుచ్చులున్న వాటినే ఏరుకుంటాం... ఇదీ అంతే. ఎన్నికలు మానేయమంటే ప్రజలు మానేస్తారా? టమాటాల విషయంలోనే కాదు, ఇది అన్నింటికీ వర్తిస్తుంది. కానీ, ఇతను కేంద్రాన్ని అడగడానికి భయమండీ అంటుంటే ఇంకేమనాలి? చంద్రబాబు మీద కేసులు ఉన్నాయి కాబట్టి ఆయన ఐదేళ్లూ అడగడానికి భయపడ్డాడని అన్నారు. ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డి మీద కూడా కేసులు ఉన్నాయి కాబట్టి అడగడానికి భయపడుతున్నాడని అంటున్నారు. కేసులు లేకుండా ఎవరున్నారు? ప్రపంచంలోకెల్లా నేనే నిజాయతీపరుడ్ని అని చెప్పే కేజ్రీవాల్ మీద కూడా కేసు పెట్టేశారు. ఢిల్లీలో ప్రైవేటు స్కూళ్లలో ఎవరు చేరకుండా, అందరూ ప్రభుత్వ స్కూళ్లలోనే చేరే పరిస్థితి తెచ్చిన సిసోడియాను కూడా జైల్లో వేసేశారు. సిసోడియా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మార్చేశాడు, ప్రభుత్వ స్కూళ్ల వాతావరణాన్నే మార్చేశాడు, ఫ్యాకల్టీలనే మార్చేశాడు.. అలాంటి వాడిపైనా కేసులు పెట్టారు. సిసోడియా జైలుకెళ్లి సంవత్సరం అవుతోంది.. అతడ్ని బయటికి రానివ్వరు. ఇలా అందర్నీ ఏరతారు.. దీని వల్ల నష్టమేంటి? జైలుకెళితే ఓడిపోతాననడం అర్థరహితం. జైలుకు వెళ్లిన ప్రతివాడు గెలుస్తున్నాడు. రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లాడు.. రాగానే గెలిచాడు. జగన్ మోహన్ రెడ్డి జైలుకు వెళ్లాడు.. గెలిచాడు. ఇవాళ చంద్రబాబు కూడా జైలుకు వెళ్లాడు.. అందరూ అదే అంటున్నారు.. చంద్రబాబు కూడా జైలుకు వెళ్లాడు, గెలుస్తాడు అంటున్నారు. ఏదైనా వివాదాస్పద అంశంలో వాళ్లది రైటా, మనది రైటా అని తిరగబడానికి కొంచెం ఆలోచించడంలో తప్పులేదు. మిగతావారంతా సపోర్ట్ చేస్తారో, చేయరో అని ఆలోచించడం సమంజసమే. కానీ చట్టాన్ని అమలు చేసే విషయంలో కూడా తిరగబడకపోతే ఎలా? పార్లమెంటు తలుపులు మూసి, ఎంతో రగడ చేసి రాష్ట్ర విభజన చట్టం తయారుచేశారు. ఆ చట్టాన్నే అమలు చేయడానికి తిరగబడమంటున్నాం" అని ఉండవల్లి స్పష్టం చేశారు.

# ఈ ప్రశ్నలకు సమాధానం చెబుతావా జగన్..?

- రాప్తాడులో సీఎం జగన్ సభపై స్పందించిన చంద్రబాబు
- జాకీ పరిశ్రమను ఎందుకు తరిమేశావు
- కియా అనుబంధ పరిశ్రమలు ఏవని అనంత అడుగుతోంది
- డ్రిప్ పథకాలు ఏవని సీమ రైతన్న అడుగుతున్నాడు



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** సీఎం జగన్ ఇవాళ ఉమ్మడి అనంతపురం రాప్తాడులో సిద్ధం సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. సీఎం జగన్ కు పలు ప్రశ్నాస్త్రాలు సంధించారు. రాప్తాడు అడుగుతోంది... జాకీ పరిశ్రమను ఎందుకు తరిమేశావని? అనంత అడుగుతోంది... కియా అనుబంధ పరిశ్రమలు ఏమయ్యాయని? సీమ రైతన్న అడుగుతున్నాడు... నాటి డ్రిప్ పథకాలు ఎక్కడని? సమాధానం చెప్పి సభ పెడతావా... సభలో సమాధానం చెబుతావా? అంటూ చంద్రబాబు నిలదీశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. అంతేకాదు, నాడు జాకీ పరిశ్రమ వెళ్లిపోవడానికి దారితీసిన పరిణామాలను కూడా చంద్రబాబు వివరించారు. "ఏపీలో జాకీ అండర్ వేర్ పరిశ్రమ పెట్టేందుకు దాని మాతృసంస్థ పేజ్ ఇండస్ట్రీస్ ముందుకు వచ్చింది. 2017లో పేజ్ ఇండస్ట్రీస్ కు ఏపీఐఐసీ ద్వారా అనంతపురం జిల్లా రాప్తాడులో అప్పటి ఏపీ ప్రభుత్వం 27 ఎకరాల భూమి కేటాయించింది. భూకేటాయింపుల ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చే సమయంలోనే ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారింది. అయితే, రూ.129 కోట్ల విలువైన ఆ ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లడంలో పేజ్ ఇండస్ట్రీస్ కు ఓ స్థానిక ప్రజాప్రతినిధి రూపంలో అవాంతరాలు ఎదురయ్యాయి. అతడు ఎన్నికల్లో గెలవడానికి అయిన ఖర్చులో సగం రూ.20 కోట్లు ఇవ్వాలని ఆ సంస్థను డిమాండ్ చేశాడు. అంతేకాదు, తన సన్నిహితులకే సబ్ కాంట్రాక్టులు ఇవ్వాలని, తాను సిఫారసు చేసిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని పేజ్ ఇండస్ట్రీస్ పై ఒత్తిడి తెచ్చాడు. తన మాట వినకపోతే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాడు. దాంతో హడలిపోయిన పేజ్ ఇండస్ట్రీస్ సంస్థ స్థానిక ప్రజాప్రతినిధి గురించి ప్రభుత్వ పెద్దలతో మొరపెట్టుకుంది. ఆ ప్రయత్నాలు కూడా ఫలించకపోగా, సమస్యలు రెట్టింపయ్యాయి. ఈ నేపథ్యంలో, 2019 డిసెంబరు 3న పేజ్ ఇండస్ట్రీస్ సంస్థ రాష్ట్ర పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యదర్శి మురుగేశన్ కు రహస్యంగా ఓ లేఖ రాసింది. తమ పెట్టుబడి ప్రతిపాదనను ఉపసంహరించుకుంటున్నామని, తమకు కేటాయించిన భూమిని వెనక్కి ఇచ్చేస్తున్నామని ఆ లేఖలో పేర్కొంది" అంటూ చంద్రబాబు వివరించారు.

# జగన్ 'యాదవ' వ్యూహం

**టీడీపీ కమ్మ నేతలకు చెక్**

- టీడీపీ కమ్మ-కాపు వ్యూహానికి ధీటుగా జగన్ బీసీ అస్త్రం
- శెట్టి బలిజలు, యాదవులకు ప్రాధాన్యం ఇస్తోన్న వైసీపీ



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాష్ట్ర ఎన్నికలు అనగానే కులాల ప్రస్తావన తెర మీదకు వస్తుంది. ప్రధానంగా కమ్మ వర్సెస్ కాపు, కమ్మ వర్సెస్ రెడ్డిగా ఆంధ్రా రాజకీయం నడుస్తుంది. ఇప్పుడు టీడీపీ, జనసేన పొత్తు కారణంగా.. ఎన్నో ఏళ్లపాటు ప్రత్యర్థులుగా ఉన్న కమ్మ, కాపు సామాజికవర్గాలు ఒకరినొకరు కలుపుకొని ముందుకెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. టీడీపీకి మొదటి నుంచి బీసీల మద్దతు ఎక్కువ. ఆర్థికంగా బలంగా ఉన్న కమ్మ సామాజికవర్గానికి.. అత్యధిక శాతం జనాభా ఉన్న కాపు సామాజికవర్గం తోడైతే.. వచ్చే ఎన్నికల్లో గెలుపు తేలికవుందనే ధీమా టీడీపీజనసేన కూటమిలోఉంది. వైఎస్సార్సీపీకి సైతం రెడ్లు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వీరితోపాటు దళితులు,క్రైస్తవులు ఆ పార్టీకి ఓటు బ్యాంకుగా ఉన్నారు. కమ్మకాపు ఈక్వేషన్‌ను దాటుకొని.. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలంటే.. బీసీలను తమవైపు తిప్పుకోవాలని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అందులో భాగంగా యాదవులు, శెట్టి బలిజల్లాంటి బీసీ వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో 7 శాతం ఉన్న యాదవ సామాజికవర్గానికి చెందిన నేతలను కమ్మ నాయకులపైకి అస్త్రంగా ప్రయోగిస్తున్నారు. కోస్తాంధ్ర ప్రాంతంలో బలంగా ఉన్న టీడీపీకి.. యాదవ సామాజికవర్గ నేతలతో జగన్ చెక్ పెట్టే ప్రయత్నంలో ఉన్నారు. యాదవ ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉండే స్థానాలను ఆ సామాజికవర్గానికి చెందిన నేతలకే కేటాయిస్తున్నారు. నర్సరావుపేట లోక్ సభ స్థానం నుంచి టీడీపీ తరఫున లావు శ్రీకృష్ణదేవరాయలు బరిలోకి దిగడం ఖాయమే. వైసీపీ సిట్టింగ్ ఎంపీ అయిన ఈయన కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు. ఇక్కడి నుంచి మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌ను జగన్ బరిలోకి దింపుతున్నారు.

## టీడీపీ-జనసేన విజయాన్ని
# ఎవరూ అడ్డుకోలేరు : సుమన్

**తిరుపతి విచ్చేసిన నటుడు సుమన్**

- గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు
- ఓటర్లు ప్రలోభాలకు గురికావొద్దని సూచన
- చంద్రబాబు పరిపాలన అనుభవం ఉన్న వ్యక్తి



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** టాలీవుడ్ సీనియర్ నటుడు సుమన్ తిరుపతి తాతయ్యగుంటలోని గంగమ్మ ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ఏపీ రాజకీయాలపై స్పందించారు. సీట్ల సర్దుబాటు ప్రక్రియ సక్రమంగా జరిగితే ఏపీలో టీడీపీజనసేన కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని సుమన్ అభిప్రాయపడ్డారు. చంద్రబాబు పరిపాలన గురించి బాగా అనుభవం ఉన్న వ్యక్తి అని, ఏపీ ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఎన్నికల్లో జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అంతేకాదు, చంద్రబాబు రాజకీయాల్లో తనకు గురువు అని సుమన్ తెలిపారు. బాపట్ల ఎంపీగా పోటీ చేయాలని చంద్రబాబు తనకు అవకాశం ఇచ్చారని, కానీ తాను ఎన్నికల్లో పోటీచేసేందుకు ఇష్టపడలేదని వెల్లడించారు. నాపై నమ్మకంతో చంద్రబాబు అవకాశం ఇవ్వాలనుకున్నారు... అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అని సుమన్ వివరించారు.




# భర్త మృతదేహం పక్కనే ప్రాణాలు విడిచిన భార్య

- తూర్పు గోదావరి జిల్లాలో విషాదం
- అనారోగ్యంతో భర్త మృతి
- మృతదేహం పక్కనే రోదిస్తూ తనువు చాలించిన భార్య

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** అనారోగ్యంతో భర్త చనిపోతే.. కట్టుకున్నవాడు ఇకలేడనే మనోవేదనతో భార్య కూడా ప్రాణాలు వదిలేసిన విషాద ఘటన తూర్పుగోదావరి జిల్లాలో చోటుచేసుకుంది. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండ గ్రామానికి చెందిన కోసూరి సత్యనారాయణ (77) వడ్రంగి పని చేస్తూ జీవిస్తుంటారు. అతని భార్య వరలక్ష్మి (65). వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. పిల్లలకు పెళ్లిళ్లు చేసి సాగనంపిన ఈ దంపతులు.. పెళ్లైన నాటి నుంచి అన్యోన్యంగా కాపురం సాగిస్తూ ఆదర్శ దంపతులుగా అందరి మన్ననలు పొందారు. అయితే వయసు పెరగడంతో సత్యనారాయణను అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. ఈ క్రమంలోనే అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున సత్యనారాయణ కన్నుమూశారు. అయితే భర్త మరణాన్ని ఆ ఇల్లాలు తట్టుకోలేకపోయింది. పెళ్లైన నాటి నుంచి తనకు కష్ట సుఖాల్లో తోడూనీడగా నిలిచినవాడు, కలకాలం తనకు తోడుగా ఉంటానంటూ బాసలు చేసినవాడు ఇక లేడు, రాడనే వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోయింది. కట్టుకున్నవాడు తనను వదిలేసి అనంతలోకాలకు వెళ్లిపోయాడనే మనో వ్యధతో సత్యనారాయణ మృతదేహం పక్కనే రోదిస్తూ తనువు చాలించింది వరలక్ష్మి. ఈ ఘటన ఆ కుటుంబాన్ని, ఆ ఊరి జనాలను విషాదంలో ముంచివేసింది. ఇన్నిరోజులు అప్యాయంగా పలకరిస్తూ, ఎంతో అన్యోన్యంగా మెలుగుతూ కనిపించిన దంపతులు.. ఒకేరోజు తనువు చాలించడంతో తంటికొండ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇన్నిరోజులు కలిసి జీవించినవారు.. కలిసి ఆ దేవుడి దగ్గరకు వెళ్లారంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# విశాఖ బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జ్.. అద్భుత అనుభవం

- రాష్ట్రంలో ఇదే తొలిసారి
- విశాఖపట్నం వెళ్లే పర్యాటకులకు గుడ్ న్యూస్
- 100 అడుగుల వరకు సముద్రంలో నడుచుకుంటే వెళ్లే ఛాన్స్

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాష్ట్రంలో తొలిసారిగా విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ అందుబాటులోకి రానుంది. విశాఖ నగరానికి వచ్చే పర్యాటకులకు ఇది సరికొత్త ఆకర్షణ కానుంది. ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్ మీద నడుచుకుంటూ.. సముద్రంలో వంద అడుగుల దూరం వరకు వెళ్లి.. అక్కడున్న వ్యూపాయింట్ మీద నిలబడి సాగర అందాలను మరింతగా ఆస్వాదించొచ్చు. తెన్నేటి పార్క్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ బ్రిడ్జ్ అడ్వెంచర్ టూరిస్టులను ఎంతగానో ఆకట్టుకోనుంది .అలల కారణంగా పర్యాటకులు సముద్రంలో పడిపోయే ప్రమాదం ఉండటంతో.. ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జికి రెండు వైపులా 34 సిమెంట్ దిమ్మెలతోపాటు అడ్డంగా రెండు ఐరన్ యాంకర్లను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా.. ప్రతి 25 మీటర్లకూ లైఫ్ గార్డ్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ బ్రిడ్జికి ఇరువైపులా రెండు లైఫ్ బోట్లను అందుబాటులో ఉంచుతారు. ఈ తేలియాడే వంతెనపైకి ఒకేసారి 200 మంది వరకూ వెళ్లొచ్చు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కమిషనర్ శ్రీకాంత్ వర్మ, ఇతర అధికారులు కలిసి శనివారం ఫ్లోటింగ్ బ్రిడ్జిని తనిఖీ చేశారు. అధికార యంత్రాంగం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే.. ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌ను సందర్శకులకు అందుబాటులోకి తీసుకొస్తారు. ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జి పైకి వెళ్లేందుకు ఒక్కొక్కరి దగ్గర్నుంచి రూ.100 నుంచి రూ.150 దాకా రుసుం వసూలు చేసే అవకాశం ఉంది. ఫ్లోటింగ్ బ్రిడ్జ్ పనుల కోసం విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీ) టెండర్లు వేయగా.. శ్రీసాయి మోక్ష షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సంస్థ పనులను దక్కించుకుంది. కోటి రూపాయల ఖర్చుతో సదరు సంస్థ ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేసింది. కేరళలోని చవక్కడ్ బీచ్‌లో ఉన్న ఫ్లోటింగ్ బ్రిడ్జ్ స్ఫూర్తితో విశాఖలోనూ ఈ తేలియాడే వంతెనను ఏర్పాటు చేశామని శ్రీసాయి మోక్ష షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ కంపెనీ ప్రతినిధి సుదర్శన్ తెలిపారు. వీఎంఆర్డీఏ అధికారులతోపాటు కంపెనీ ప్రతినిధులు కేరళలోని ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌ను పరిశీలించిన తర్వాత.. విశాఖలో ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

# 'సిద్ధం' సభలో సీఎం జగన్ మాస్ పంచులు

**రాప్తాడులో వైసీపీ సిద్ధం బహిరంగసభ**

- భారీగా తరలివచ్చిన వైసీపీ కార్యకర్తలు, అభిమానులు
- పంచులు, సెటైర్లతో స్పీచ్ అదరగొట్టిన జగన్




**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో సీఎం జగన్ పంచుల వర్షం కురిపించారు. భారీగా తరలివచ్చిన అశేష ప్రజానీకాన్ని తన స్పీచ్‌తో ఉర్రూతలూగించారు. ఐదేళ్ల క్రితమే ఏపీ జనం చొక్కా మడతేసి టీడీపీకి 23 సీట్లు ఇచ్చారన్న జగన్.. మరోసారి చొక్కా మడతపెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. దేవుడు ఒక్కసారి ఆశీర్వదిస్తేనే ఇంత మంచి చేశామన్న జగన్.. ఇక రెండు, మూడోసారి గెలిపిస్తే ఇంకెంత మంచి చేస్తామో ఆలోచించాలన్నారు. 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు పదవుల్లో ప్రాధాన్యతనిచ్చామనీ.. 57 నెలల కాలంలోనే 2 లక్షల 13 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ వైసీపీనే రావాలని జగన్ అన్నారు. ఈ క్రమంలోనే టీడీపీ, జనసేనపై సీఎం జగన్ సెటైర్లు వేశారు. సైకిల్ ఎప్పుడూ బయట, తాగేసిన టీ గ్లాస్ ఎప్పుడూ సింక్‌లోనే ఉండాలన్న జగన్.. ఫ్యాన్ ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలంటూ విపక్షాలపై సెటైర్లు వేశారు. ఇదే సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్ మీద విమర్శలు చేశారు. ఎగ్గొట్టేవాడు 10 రూపాయల వడ్డీ అయినా ఇస్తానని అంటాడన్న జగన్.. మానిఫెస్టో మాయం చేసి హామీలు ఎగ్గొట్టే బాబు కేజీ బంగారం ఇస్తాను అంటారంటూ ఎద్దేవా చేశారు. చంద్రబాబు చేసేవన్నీ మోసాలే, చెప్పేవన్నీ అబద్ధాలేనని అన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో రైతులకు గుర్తుకు వచ్చే పథకం ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. అందుకే చొక్కా మడతేసి, కుర్చీ మడతపెట్టి.. చీపుర్లతో టీడీపీని ఊడ్చేయాలని పిలుపునిచ్చారు. ప్రసంగం ప్రారంభంలో ఉవ్వెత్తున తరలివచ్చిన జన సందోహాన్ని ఉద్దేశించి జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జిల్లాల విభజన తర్వాత రాయలసీమకు జల సముద్రం వస్తే.. సిద్ధం సభతో రాయలసీమకు జనసముద్రం వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో యుద్ధం జరగబోతోందన్న జగన్.. ఈ యుద్ధం, మాట ఇచ్చి నిలబెట్టుకున్న వైసీపీకి.. మాటతప్పటమే అలవాటుగా ఉన్న పెత్తందార్లకు మధ్యన జరుగుతున్న యుద్ధంగా అభివర్ణించారు. ఇదే సమయంలో తన పేరు చెబితే గుర్తుకు వచ్చే ఒక్క పథకాన్ని అయినా చెప్పాలంటూ చంద్రబాబుకు సవాల్ చేశారు. తాము ఇచ్చిన మాట నెరవేర్చామని.. అందుకే వైనాట్ 175 అంటూ ఎన్నికలకు వెళ్తున్నామన్నారు.

# హీట్ పెంచుతున్న బెజవాడ పాలిటిక్స్

- విజయవాడ పార్లమెంట్ పరిధిలో వైసీపీ,టీడీపీ మధ్య నువ్వానేనా అనే పోటీ
- బెజవాడ పార్లమెంట్ కోసం కేశినేని బ్రదర్స్ పోటీ
- అసెంబ్లీ స్థానాల్లో సైతం ఇదే పరిస్థితి



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** విజయవాడ పార్లమెంట్ పరిధిలో వైసీపీ,టీడీపీ మధ్య నువ్వానేనా అనే పోటీ నెలకొంది. బెజవాడ పార్లమెంట్ కోసం కేశినేని బ్రదర్స్ రేసులో ఉంటే.. అసెంబ్లీ స్థానాల్లో సైతం ఇదే పరిస్థితి ఉంది. అధికార వైసీపీలో సీట్లు కొలిక్కి వచ్చినా, తెలుగుదేశం పార్టీలో మాత్రం సీట్ల సర్దుబాటు కొలిక్కి రావడంలేదు..దీంతో ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల వేడి రోజురోజుకూ పెరిగిపోతుంది. విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల నేతలతో పాటు ఆశావహులు కూడా ఎన్నికల కోసం సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా ఇప్పటికే విజయవాడ పార్లమెంట్ స్థానం కోసం ఎంపీ కేశినేని నానిని ఇంచార్జిగా నియమించింది వైసీపీ. ఇక, నాని సోదరుడు కేశినేని చిన్ని తనకే టిక్కెట్ అనుకుంటూ పర్లమెంట్ పరిధిలో వరుస పర్యటనలు చేస్తున్నారు. త్వరలోనే అధికారికంగా చిన్ని పేరును ప్రకటిస్తారనే చర్చ కూడా జరుగుఉంది. ఇక పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ ఇంచార్జిలు ఖరారయ్యారు. అయితే తెలుగుదేశం పార్టీ అధికారికంగా అభ్యర్థులను ప్రకటించకపోయినప్పటికీ కొన్ని చోట్ల ఇంచార్జిలకు మాత్రం టిక్కెట్లు ఖరారు చేసినట్లు సమాచారం ఇచ్చారు. మరికొన్ని నియోజకవర్గాల్లో మాత్రం ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.



# ఫిజికల్ డైరెక్టర్ గా ఎంపికైన జిల్లేపల్లి శోభన్

**మునగాల, విశాలభారతి:**
గ్రామంలోని ప్రతి యొక్క యువతీ యువకులు క్రమశిక్షణతో చదివి ఉన్నత ఉద్యోగాలు పొందాలని గురుకుల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జిల్లేపల్లి శోభన్ బాబు అన్నారు. మండల పరిధిలోని తాడ్వాయి గ్రామంలో ఇటీవల వెలువడిన గురుకుల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఫలితాలలో రాష్ట్రంలో రెండో ర్యాంక్ సాధించిన జిల్లేపల్లి శోభన్ బాబు గ్రామ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, యువకులు ఘనంగా సన్మానించారు. శోభన్ బాబును ఆదర్శంగా తీసుకొని యువతీ యువకులు ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సోమపంగు గోపి, జిల్లేపల్లి శ్రీనివాస్, జిల్లేపల్లి సుమన్, రవి, మచ్చ పాండు, సైదిబాబు, వెంకటేశ్వర్లు, గురుస్వామి, మచ్చ వెంకటేష్, పలువురు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, యువకులు పాల్గొన్నారు.

# వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలి

**తొర్రూరు, విశాలభారతి:**
ఎస్ జి టి, స్కూల్ అసిస్టెంట్ల మధ్య వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలని ఎస్టియుటిఎస్ అధ్యక్షుడు కొరవి సుధాకరా చారి డిమాండ్ చేశారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎస్ టి యు జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న డిఏ లు చెల్లించాలని, సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కర్మకాండము చేసిన ఉద్యోగికి 15 రోజుల వేతనాలతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు. కేజీవీబీ, ఎస్ ఎస్ ఏ లో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి మినిమం టైం స్కేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో వెంటనే స్కావెంజర్లను నియమించాలని కోరారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు. ఆదాయ పన్ను పరిమితి రూ.10 లక్షలకు పెంచాలి అన్నారు. ఎఫ్ ఎల్ ఎన్ ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్ టి యు అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎస్టియు ప్రధాన కార్యదర్శి జి. యాకుబ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, గుంటుక యాకయ్య, శ్రీనివాస్, రమేష్, హరికృష్ణ చారి, ముఖ్య సలహాదారుడు విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.






# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**కోదాడ, విశాలభారతి:**
పట్టణ ప్రజలకు మెరుగైన పాలన అందించాలని అందుకు తమ పూర్తి సహకారం ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిలు తెలిపారు. ఆదివారం కోదాడ మున్సిపాలిటీ చైర్మన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు లు హైదరాబాదులో వారిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కోదాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పదంలో నడిపించి రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని నూతన పాలకవర్గాన్ని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ ను మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గంధం యాదగిరి, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రిసెప్షన్ లో పాల్గొన్నే శివరామకృష్ణ



**పాలేరు, విశాలభారతి:**
తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణాల సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి కుమారుడు రోహిత్ రెడ్డి వివాహ రిసెప్షన్ మంత్రి సొంత ఊరు అయినటువంటి కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలొ జరిగింది ఇట్టి కార్యక్రమానికి కుటుంబ సమేతంగా పాలేరు నియోజకవర్గ నాయకులు చావా శివరామకృష్ణ, పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. వారితోపాటు ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తాటికొండ కిరణ్, కోట్ల కిరణ్, జాల కిరణ్ పిడియల నవీన్, మరియు అభిమానులు పాల్గొన్నారు.

# సీఐ సురేందర్ రెడ్డిని కలిసిన సందీప్ గౌడ్



**సూర్యాపేట, విశాలభారతి:**
**సూర్యాపేట రూరల్ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సురేందర్ రెడ్డి ని శనివారం సూర్యాపేట రూరల్ సీఐ కార్యాలయంలో పిల్లలమర్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు జెర్రిపోతుల సందీప్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐ సురేందర్ రెడ్డిని బొకే, శాలువాతో సన్మానం చేశారు.**

# స్థానిక ఎమ్మెల్యేకి అవమానం

- **వేదిక మీదికి ఆహ్వానించని వైనం**
- **తీవ్రంగా ఖండించిన ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షురాలు కుంజా రమాదేవి**

**భద్రాచలం, విశాలభారతి:**
ఐటిడిఎలో పాలకమండలి నిర్వహించడం జరిగింది. ఈ పాలక మండలి సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఐటిడిఎపిఓ జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాలక మండల సమావేశంలో పాల్గొనడం జరిగిందనీ కానీవేదిక మీదకు స్థానిక ఎమ్మెల్యే వెంకట్రావును ఆహ్వానించకపోవడం పట్ల ఎమ్మెల్యేని అవమాన పర్చినట్లు అయిందని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కుంజ రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుంజ రమా దేవి మాట్లాడుతూ.. గిరిజన సమస్యల పైన ఐటిడి ఏ ఆవరణలో జరుగుతున్న పాలక మండల సమావేశం గిరిజనుల సమస్యల పైన ఈ ప్రాంత అభివృద్ధి కోసం ముందుగా ప్రణాళికలు రూపొందించడం కోసం జరుగుతున్న సమావేశంలో భద్రాచలం నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థి తెల్లం వెంకట్రావును ఆహ్వానించ



కుండా ప్రోటోకాల్ పాటించలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత సమస్యలను పరిష్కరించే బాధ్యత ఎమ్మెల్యేకి ఉందని కానీ సమస్యలను ప్రస్తావించడానికి అవకాశం ఇవ్వకపోవడం చాలా దారుణమైన అంశమని ఆమె మండిపడ్డారు.

# కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది



**సంకినేని కృష్ణారావు**

**సూర్యాపేట, విశాలభారతి:**
కరాటేతో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని, సంపూర్ణవికాసం కలుగుతుందని, చురుకుదనం, జిజ్ఞాస పెరుగతాయని ఎస్ కే ఆర్ కన్ స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ సంకినేని కృష్ణారావు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏవీఎం హైస్కూల్ లో అక్షరఫౌండేషన్, షీ టీంసూర్యాపేట ఆధ్వర్యంలో ఎస్ కె ఆర్ కన్ స్ట్రక్షన్ సూర్యాపేట సౌజన్యంతో నిర్వహిస్తోన్న బాల,బాలికలు, మహిళలకు ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్ రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తోన్న అక్షర ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పు నాగయ్య, సొల్లేటి ఉపేంద్రాచారి, స్కూల్ ప్రిన్సిపాల్ ఫాతిమా, తుంగతుర్తి జనార్ధనాచారి, నరాల తిరుమలరెడ్డి, రుద్రంగి కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్

**చౌటుప్పల్, విశాలభారతి:**
మున్సిపల్ కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాల లో SFI ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను మాతృశ్రీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. మహేందర్ రెడ్డి గారు, SFI జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె శివకుమార్ విడుదల చేసారు, వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల్లో ప్రతిభను వెలికితేసేందుకు SFI టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని అన్నారు,పబ్లిక్ పరీక్ష ల పై విద్యార్థుల్లో ఉన్న భయం పోవడానికి ఈ టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని అన్నారు, SFI ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తూనే విద్యార్థులను చైతన్యపరిచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అదేవిధంగా త్వరలో జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణత సాధించి, వారు అనుకున్న లక్ష్యాలను సాధించాలని అన్నారు మరియు విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చిన పోరాడేందుకు ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి ప్రకాష్, సాతిరి మనోజ్, మండల నాయకులు మాధగోని లింగస్వామి, నూనె రాము,జోగు విక్రమ్, బోయ నగేష్,లక్ష్మణ్,ఫరన్, శిరీష పాల్గొన్నారు.

# ప్రణాళికలు సిద్ధం చేయండి

## జీవన స్థితిగతులు మెరుగుపడాలంటే విద్య అభివృద్ధి చెందాల్సిందే




**భద్రాచలం, విశాలభారతి:**
గిరిజన కుటుంబాలకు మేలు జరిగే విధంగా విద్యా వైద్యం ఆశ్రమ పాఠశాలలు మరియు గురుకులాలలో విద్యా వ్యవస్థను బలిపేతం చెసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గిరిజన గ్రామాలలో నివసించే ఆదివాసి గిరిజనులకు గిరిజన పిల్లలకు విద్యా వైద్యం ఉపాధికి బాటలు వేసే విధంగా ఐటిడిఏ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఐటీడీఏ పరిధిలో గిరిజన జీవన స్థితిగతులు మెరుగుపడాలంటే విద్య అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. రెసిడెన్షియల్ ఆశ్రమ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, పార్లమెంటు సభ్యులు కవిత, శాసనసభ్యులు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు, జారి ఆదినారాయణ, కోరం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



# బోనాలు సమర్పించిన మహిళలు

**ఆర్మూర్, విశాల భారతి: నందిపేట్ మండలంలోని మాయాపూర్ గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ దేవాలయంలో చలి బోనాలు సమర్పించారు. మహిళలు ఇంటి వద్ద నుండి బోనాలను ముత్యాలమ్మ, ఐ చేతుల దేవాలయం ఊరాడి మైసమ్మకు నైవేద్యాలు సమర్పించారు. మహిళలు భారీగా రావడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి.**

# అభివృద్ధికి కాంగ్రెస్ కృషి చేస్తుంది

**ముస్కు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు**



**కోదాడ, విశాలభారతి:**
గ్రామ అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ అనంతగిరి మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం అనంతగిరి మండల పరిధిలోని కొత్త గోల్ తండా, పాత గోల్ తండా, మీట్య తండా, కొత్తగూడెం, చనుపల్లి, కిష్టపురం, పాలరం తండా గ్రామాలలో సిసి రోడ్లు డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రెండు కోట్ల 80 లక్షల ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని అందులో భాగంగానే ప్రతి గ్రామంలో సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# మాదిగలంత ఏకమై హక్కుల కోసం పోరాడాలి

**గుండా థామస్ మాదిగ**

**మంచిర్యాల, విశాల భారతి:** మంచిర్యాల జిల్లా ప్రెస్ క్లబ్ లో ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్ మీట్ లో ఎం ఆర్ పీ యస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎం ఆర్ పీ యస్, ఎం ఎస్ పీ, అనుబంధ సంఘాల జిల్లా ఇంచార్జి గుండా థామస్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎంఆర్ పీ యస్, అనుబంధ సంఘాల నూతన నిర్మాణం చేపట్టాలని తెలియజేశారు. మాదిగలంత ఏకమై హక్కుల కోసం పోరాటం చేయడానికి సిద్ధం కావాలి మంద కృష్ణ మాదిగ పిలుపుకి సిద్ధం ఉండాలని మనస్పూర్తిగా కోరారు. ఎంఆర్పీయస్ అనుబంధ సంఘాల జిల్లా ఇంచార్జి గుండా థామస్ మాదిగ, ఎంఆర్పీయస్ జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య మాదిగ, ఎంయస్పి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ మాదిగ, మంచిర్యాల టౌన్ ఇంచార్జి చిప్పకుర్తి మల్లేష్ మాదిగ, ఎంఎస్ ఎఫ్ జిల్లా ఇంచార్జి చిప్పకుర్తి సతీష్ మాదిగ, గారే చంద్ర శేఖర్ మాదిగ ఎం ఆర్ పీ యస్, ఎం ఎస్ పీ, ఎం ఎస్ ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com

సోమవారం,
19.02.2024
హైదరాబాద్

vishalabharathi Telugu Daily



మెగాస్టార్ చిరంజీవి తన అర్ధాంగి సురేఖకు సోషల్ మీడియా వేదికగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. "నా జీవన రేఖ, నా సౌభాగ్య రేఖ, నా భాగస్వామి సురేఖ.. నా లైఫ్‌లైన్‌కి, నా విజయానికి కారణమైన సురేఖకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలి" అని ఎక్స్ వేదికగా మెగాస్టార్ ఆకాంక్షించారు. చిరంజీవి ప్రస్తుతం సురేఖతో కలిసి విదేశాల్లో ఉన్నారు. విశ్వంభర షూటింగ్ నుంచి బ్రేక్ తీసుకున్న చిరంజీవి అర్ధాంగితో కలిసి యూఎస్ వెళ్లారు. ఈ విషయాన్ని చిరు స్వయంగా వెల్లడించారు. హాలీడే కోసం యూఎస్ వెళ్తున్నామని, వచ్చాక తిరిగి విశ్వంభర సినిమా షూటింగ్ ప్రారంభిస్తామని చెబుతూ సురేఖతో విమానంలో దిగిన సెల్ఫీని షేర్ చేశారు.

# కవర్ పేజ్‌లో రకుల్



ఈ నెలలో అందాల రకుల్ ప్రీత్ సింగ్ తన ప్రియుడు జాకీ ని వివాహం చేసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆ విషయం నిజమే అన్నట్లుగా ఆమె సన్నిహితులు ఆఫ్ ది రికార్డ్ పేర్కొన్నారు. పెళ్లి హడావుడిలో ఉన్న రకుల్ ఫోటో షూట్స్ ను మాత్రం వీడటం లేదు. తాజాగా మరో అందాల ఫోటో షూట్ తో వచ్చింది. రకుల్ ప్రీత్ సింగ్ ప్రముఖ మేగజైన్ ఎల్లే కవర్ పేజ్ కోసం అందాల ఫోజ్ లను ఫోటోల కోసం వచ్చింది. చూతు తిప్పకోనివ్వని అందం రకుల్ ది అంటూ ఈ ఫోటోలతో మరోసారి నిరూపితం అయ్యింది. మతి పోగొడుతున్న రకుల్ ప్రీత్ సింగ్ ఎల్లే కవర్ పేజ్ పిక్స్ కు నెటిజన్స్ కూడా నోరు వెళ్లబెట్టి మరీ వావ్ అంటున్నారు. పెళ్లి తర్వాత కూడా సినిమాలు, సిరీస్ ల్లో తాను నటిస్తాను అంటూ గతంలోనే ప్రకటించిన రకుల్ ప్రీత్ సింగ్ వచ్చే ఏడాది పై ఆశలు పెట్టుకున్నట్లుగా తెలుస్తోంది. పెళ్లి తో లక్ కలిసి వచ్చి సీనియర్ హీరోలకు జోడీగా అయినా ఆఫర్లు వస్తాయేమో చూడాలి అన్నట్లుగా వెయిట్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఘనంగా సూపర్ ఉమెన్ మూవీ ఇంద్రాణి ట్రైలర్ లాంచ్ వేడుకలు




యానీయా భరద్వాజ్, కబీర్ దుహాన్ సింగ్ ప్రధాన పాత్రలలో నటిస్తోన్న చిత్రం ఇంద్రాణి. అత్యాదునిక సాంకేతక ప్రమాణాలతో, వినూత్నభరితమైన టైమ్ ట్రావెల్ కాన్సెప్టుతో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో ఈ మూవీ రూపొందుతోంది. ఈ మూవీ ద్వారా స్టెఫన్ పల్లం దర్శకుడిగా పరిచయ మవుతుండగా వెరోనికా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై స్టాన్లీ సుమన్ బాబు నిర్మాణ సారథ్యంలో సుధీర్ వేల్పుల, KK రెడ్డి, జైసన్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సాయి కార్తిక్ సంగీత దర్శకత్వం వహించారు. ఘనయిత జిజిన, గరీమా కౌశల్, ప్రతాప్ సింగ్, అజయ్, సప్తగిరి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి మంచి రెస్పాన్స్ రాగా తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను హైదరాబాద్‌లోని పార్క్ హయాత్ హోటల్‌లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి మెలోడి బ్రహ్మ మణిశర్మ, ప్రముఖ నిర్మాత అనీల్ సుంకర ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో... మెలోడిబ్రహ్మ మణిశర్మ మాట్లాడుతూ ``ఇంద్రాణి ట్రైలర్ చాలా బాగుంది. సాంగ్స్ కూడా బాగున్నాయి. ఆల్ ది వెరీ బెస్ట్ టు సాయి కార్తిక్. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ `` అన్నారు. ప్రముఖ నిర్మాత అనీల్ సుంకర మాట్లాడుతూ `అమెరికాలో ఉంటూ కూడా ఇక్కడ మూవీ నిర్మించిన కేకే రెడ్డి గారికి వారి మిత్రులకి ఆల్ ది బెస్ట్..అక్కడ ఉండి సినిమా నిర్మించడం ఎంత కష్టమో నాకు తెలుసు. సినిమా మీద ప్యాషన్ ఉంటే తప్ప అది సాధ్యం కాదు..వారు నా మిత్రులు అని చెప్పుకోవడానికి నేనే గర్వపడుతున్నాను. ఇంద్రాణి పేరులోనే క్రియేటివిటీ ఉంది. పోస్టర్ చూడగానే డైరెక్టర్ విజన్ అర్థమైంది. ట్రైలర్ చాలా గ్రాండ్‌గా ఉంది. వారి కష్టం, ఖర్చు రెండు కనిపిస్తున్నాయి. ఏప్రిల్ 5న రిలీజ్ చేస్తున్నారు. వారికి మంచి సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను`అన్నారు. స్టాన్లీ పల్లం మాట్లాడుతూ `మూడు రోజుల్లోనే ఇంత పెద్ద ఈవెంట్ జరగడానికి సహాయపడ్డ కేకే రెడ్డి గారికి థ్యాంక్స్.. ఇలా ఈవెంట్ ఉంది చెప్పగానే మొత్తం అమెరికానే ఇక్కడ దింపేశారు. నా బ్రదర్ స్టీఫెన్ ఈ కథని నాకు కోవిడ్ టైమ్‌లో చెప్పాడు. ఆ తర్వాత మా శ్రేయోభిలాషుల సహాయంతో మేమే సినిమా నిర్మించాం. షూటింగ్ పూర్తి చేసిన తర్వాత కేవలం వీఎఫ్ఎక్స్ వర్క్ కోసం ఏడాది కష్ట పడ్డాడు. ఈ సినిమా క్లైమాక్స్‌లో ఏం జరగబోతుంది అనేది ఊహించడం చాలా కష్టం. అంత అద్భుతమైన కథ. ట్రైలర్ అందరికీ నచ్చింది. ఈ సినిమా ఇంత బాగా వచ్చిందంటే ఆ క్రెడిట్ అంతా మా బ్రదర్ స్టీఫెన్‌కే చెల్లుతుంది. సాయి కార్తిక్ సింగిల్ సిట్టింగ్స్‌లోనే మంచి సాంగ్స్ ఇచ్చాడు. ఈ సినిమా నిర్మాణంలో మాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్` అన్నారు.



# శ్రియ గ్లామర్ సీక్రెట్

నదైన అందం అభినయంతో దశాబ్దాల పాటు నటిగా ఏలిన శ్రీయ శరణ్ ఇంతకుముందు విదేశీ క్రీడాకారుడు ఆంద్రి కోశ్చీవ్ ని పెళ్లాడిన సంగతి తెలిసిందే. ఈ దంపతులకు ఒక కుమార్తె కూడా జన్మించింది. ముంబైలో భర్తతో కాపురం పెట్టిన తర్వాత తిరిగి తన సెకండ్ ఇన్నింగ్స్ ని శ్రీయ ప్రారంభించింది. ఇటీవల వరుస ఫోటోషూట్లతోను శ్రీయ చెలరేగుతోంది. మొన్నటికి మొన్న తన భర్తతో పబ్లిక్ లో లిప్ లాక్ వేయడం వెనక కారణాలను వెల్లడించింది. ఒక ముద్దు చాలా ఒత్తిళ్లకు పరిష్కారమని అంది. ఇంతలోనే ఇప్పుడు మరో ఘాటైన ఫోటోషూట్ తో శ్రీయ చెలరేగింది. శ్రీయ మై సౌత్ దివా 2024 క్యాలెండర్ పై దర్శనమిచ్చింది. ఇందులో అందమైన తెల్లని డిజైనర్ చీర డిజైనర్ బ్లౌజ్‌లో ఎంతో స్పెషల్ గా కనిపిస్తోంది. శ్రీయ గ్లామ్ కంటెంట్ యువతరానికి స్పెషల్ ట్రీట్ గా మారింది. పెళ్లయి బిడ్డ పుట్టాక కూడా ఇంత అందాన్ని ఎలా మెయింటెయిన్ చేస్తోంది? అనే సందేహాలు అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. శ్రీయ 40 ప్లస్ ఏజ్ లోను పర్ఫెక్ట్ ఫిట్ గా కనిపిస్తోంది. ఈ ఫోటోగ్రాఫ్ కి ఆసక్తికర క్యాప్షన్ ని జోడించారు. సూపర్ టాలెంటెడ్.. సూపర్ ఫిట్.. సూపర్ మామ్ @మై సౌత్ దివా క్యాలెండర్ 2024 @శ్రీయ శరణ్ 1109 కవర్ పేజీ కోసం షూట్ చేయడం ..ప్రదర్శించడం చాలా ఆనందంగా ఉంది... అని ఫోటోగ్రాఫర్ మనోజ్ వెల్లడించారు. 'అవారపన్' తర్వాత ఇమ్రాన్ హష్మీతో శ్రీయ శరణ్ 2007లో 'ఆవరపన్' అనే సినిమాలో నటించింది. ఈ సినిమా చేసిన దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఇమ్రాన్ హష్మీతో మళ్లీ కలిసి పని చేయడం గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. కరణ్ జోహార్‌తో కలిసి పని అనుభవం గురించి శ్రీయ తాజా షోలో ముచ్చటించారు. శ్రీయ మాట్లాడుతూ- ''నేను కరణ్‌ని చాలాసార్లు కలిశాను. అతడు చాలా అందమైన వ్యక్తి. అతడు ప్రేమగా ఆప్యాయంగా ఉంటాడు. మా నాన్న హాస్పిటల్‌లో ఉన్నప్పుడు ఆరోగ్యం ఎలా ఉందో ఆరా తీసేందుకు ప్రయత్నించాడు. ఆయనను పార్టీలలో చూశాను. నిజంగా ప్రజలను గొప్పగా నవ్వించగలడు. హాస్యచతురుడు. వృత్తిపరంగా నాకు ధర్మాటిక్స్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభవం'' అని అన్నారు.



పసుపు రంగు చీరలో బుట్టబొమ్మ




# మెగా హీరో సాయిధరమ్ తేజ్ చిత్రం 'గాంజా శంకర్'

ఈ మూవీ టైటిల్‌పై తెలంగాణ రాష్ట్ర నార్కొటిక్ బ్యూరో(TSNAB) ఆగ్రహం వ్యక్తం చేసింది. సినిమా పేరును మార్చాల్సిందేనంటూ చిత్రబృందానికి నోటీసులు పంపింది. ఈ మూవీ ట్రైలర్ సైతం యువతపై ప్రభావం చూపేలా ఉందని, దాన్ని కూడా మార్చాలని ఆదేశించింది. సినిమా ఆర్టిస్టులు, ఇతర సెలబ్రిటీలు సామాజిక బాధ్యతతో నడుచుకోవాలని నోటీసుల్లో పేర్కొంది.

# గామి.. టీజర్ పై ప్రభాస్ ప్రశంసలు



టాలీవుడ్ సినీ ప్రియులు మాస్ కా దాస్ అని ముద్దుగా పిలుచుకునే యంగ్ హీరో విశ్వక్ సేన్ వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. గతేడాది దాస్ కా ధమ్కీ హిట్ తో కొట్టిన విశ్వక్.. ఈ ఏడాది రెండు మూడు చిత్రాలతో అలరించనున్నారు. నాలుగేళ్లుగా షూటింగ్ జరుపుకుంటున్న గామి మూవీని ఇటీవల రేసులోకి తీసుకొచ్చారు విశ్వక్. శివరాత్రి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అయితే ఇప్పటి వరకు మాస్ రోల్స్ ఎక్కువగా చేసిన విశ్వక్ సేన్.. గామి మూవీలో వైవిధ్యమైన పాత్రలో అలరించనున్నారు. మానవ స్పర్శ తట్టుకోలేని ఓ అఘోరగా కనిపించనున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ సినిమా మేకర్స్ ఇటీవల రిలీజ్ చేసిన టీజర్.. సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేసింది. యూట్యూబ్ లో నెం.1 ట్రెండింగ్ లో ఉంది. తాజాగా ఈ సినిమా టీజర్ పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఇన్ స్టాగ్రామ్ వేదికగా ప్రశంసలు కురిపించారు. మూవీ టీమ్ కు బిగ్ బూస్టింగ్ ఇచ్చారు. టీజర్ ఎక్స్ ట్రార్డినరీగా ఉందని ప్రభాస్ తెలిపారు. ఫిబ్రవరి 29వ తేదీన రిలీజ్ కానున్న ట్రైలర్ కోసం వేచి చూస్తున్నట్లు చెప్పారు. ప్రభాస్ ఇన్ స్టా స్టోరీని రీ షేర్ చేశారు విశ్వక్ సేన్. అయితే ప్రభాస్ ఎంత బిజీగా ఉన్నా.. కంటెంట్ ఉన్న సినిమాలను ఎంకరేజ్ చేయడంలో ముందు ఉంటారని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.